

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.46

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.46 పలికింది. కనిష్టం రూ.24, సరాసరి రూ.36 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.9°/23.2°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

15 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిశాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 15 మండలాల పరిధిలో 5.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రాయదుర్గం 26.4 మి.మీ, బ్రహ్మసముద్రం 22 మి.మీ, తాడిపత్రి 20.4 మి.మీతో పాటు గుమ్మఘట్ట, పెద్దపప్పూరు, పుట్లూరు, వజ్రకరూరు, యల్లనూరు, శెట్టూరు, గుంతకల్లు, బొమ్మనహాళ్ తదితర మండలాల్లో తేలికపాటి వర్షాలు పడ్డాయి. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా ఇప్పటి వరకు 34.8 మి.మీ నమోదైంది. మంగళవారం కూడా జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత సోమవారం విడుదల చేశారు. బీఏ కోర్సులో మొత్తం 394 మందికి గాను 269 మంది (68.27 శాతం), బీబీఏ కోర్సులో మొత్తం 553 మందికి గాను 314 మంది (56.78 శాతం), బీసీఏ కోర్సులో మొత్తం 59 మందికిగాను 54 మంది (91.53 శాతం), బీకాంలో మొత్తం 3,928 మందికిగాను 1,796 మంది (45.72 శాతం), బీఎస్సీలో మొత్తం 1,897 మందికిగాను 1,313 మంది (69.21శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా బీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు.

బీమాలో అవకతవకలు.. నలుగురిపై క్రమశిక్షణ చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్–2021లో దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఉచిత పంటల బీమా కింద మంజూరైన పరిహారం పంపిణీలో అవకతవకలు చోటు చేసుకున్నట్లు విచారణలో తేలడంతో సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విడపనకల్లు మండలం డొనేకల్లు గ్రామంలో అవకతవకలను గుర్తించినట్లు తెలిపారు. పత్తి, మిరప పంటలకు సంబంధించి ఇష్టారాజ్యంగా ఈ–క్రాప్ చేయడంతో అనర్హులకు బీమా పరిహారం మంజూరైందని, అర్హులకు పరిహారం మంజూరు కాలేదని పేర్కొన్నారు. అనర్హులకు రూ.10,39,085 పరిహారం జమ చేసినట్లు విచారణలో గుర్తించామన్నారు. దీనికి బాధ్యులుగా అప్పటి జాయింట్ డైరెక్టర్ (జేడీఏ) బి.చంద్రానాయక్ (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా జేడీఏ), ఉరవకొండ డివిజన్ ఏడీఏ ఎస్.పద్మజ, విడపనకల్లు అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏఓ) ఆర్.మధుమతి, డొనేకల్లు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ) కె.విజయభాస్కర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు.

అన్నంలో బల్లి..! బహిర్గతం చేసిన విద్యార్థినిపై దాడి

గుంతకల్లు రూరల్: 'అంకుల్ అన్నంలో బల్లి పడింది' అంటూ గుట్టురట్టు చేసిన విద్యార్థినిపై మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడు చెయ్యి చేసుకున్నాడు. గుంతకల్లు మండలం పాతకొత్తచెరువు జెడ్పీహెచ్ఎస్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.వివరాలు.. ఈ నెల 21న మధ్యాహ్న భోజన సమయంలో అన్నంలో బల్లి పడిన విషయాన్ని గుర్తించిన కొందరు విద్యార్థినులు మాట్లాడుకుంటుండగా... మరో విద్యార్థిని నేరుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడు కృష్ణమూర్తిని కలసి బల్లి విషయం తెలిపింది. దీంతో కృష్ణమూర్తి అసహనం వ్యక్తం చేస్తూ విద్యార్థిని చెయ్యి పట్టుకుని అన్నం డెక్షా వద్దకు బరబరా ఈడ్చుకెళ్లి బల్లి ఎక్కడుందో చూపించమంటూ గద్దించాడు. ఊహించని ఈ పరిణామానికి ఆమె బెంబేలెత్తిపోయింది. అదే సమయంలో విద్యార్థినిపై కృష్ణమూర్తి చెయ్యి చేసుకున్నాడు. సాయంత్రం బడి వేళలు ముగిసిన తర్వాత ఇంటికి చేరుకున్న బాధితురాలు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో సోమవారం ఉదయం వారు పాఠశాలకు చేరుకుని కృష్ణమూర్తిని మందలించారు. కాగా, ఈ ఘటనపై పాఠశాల హెచ్‌ఎం మంజుల ద్వారా సమాచారం అందుకున్న ఎంఈఓ మస్తాన్‌రావు మంగళవారం విచారణ చేపట్టనున్నారు.



న్యాయం గెలిచింది

- కందుకూరు శివారెడ్డి హత్యకేసులో తీర్పు వెలువరించిన న్యాయస్థానం
- ముద్దాయిలకు రెండు జీవిత కాలాల కఠిన కారాగార శిక్ష
- హర్షం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



కందుకూరు గ్రామ ముఖచిత్రం



ముద్దాయిలను తీసుకెళ్తున్న పోలీసులు

రాప్తాడురూరల్: ఎంతో చైతన్యం కల్గిన గ్రామం. పండుగలు, ఏవైనా శుభకార్యాలు జరిగితే రాజకీయ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా గ్రామస్తులంతా కుటుంబ సభ్యుల్లా కలసిపోయేవారు.సంతోషంగా వేడుకలు జరుపుకునేవారు. ఇంతటి ప్రశాంతమైన గ్రామంలో ఆరేళ్ల క్రితం కలకలం రేగింది. కొంతమంది రాజకీయ శక్తులు తమ స్వార్థం కోసం జరిపిన హత్యోదంతంతో ఒక్కసారిగా గ్రామస్తులంతా శోకంలో మునిగిపోయారు. తమ ఆప్తుడు, ఎంతో సౌమ్యుడైన వ్యక్తిని చంపారన్న వార్తను తట్టుకోలేకపోయారు. మానవత్వం మరిచి, కర్కశంగా ప్రవర్తించిన హంతకులకు తాజాగా శిక్ష పడడంతో వారంతా ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామంలో 2018లో వైఎస్సార్ సీపీ నేత శివారెడ్డి హత్య కలకలం రేపింది. శివారెడ్డి హత్యతో ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోగా.. గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. గ్రామానికి సంబంధం లేని వ్యక్తులు ఆధిపత్యం కోసం సౌమ్యుడు, వివాదరహితుడిని హత్య చేయడాన్ని ముక్తకంఠంతో ఖండించారు.

ముద్దాయిలకు శిక్షతో హర్షాతిరేకాలు

శివారెడ్డి హత్యపై పోలీసులు కేసు నమోదు చేయగా.. జిల్లా కోర్టులో విచారణ నడిచింది. అభియోగాలు రుజువు కావడంతో సాకే బాలకృష్ణ (ఏ1), సాకే రమేష్ (ఏ3), సాకే అశోక్(ఏ4), సాకే భాస్కర్ (ఏ5), సాకే విజయ్‌కుమార్ (ఏ6), తలారి సూర్యనారాయణ (ఏ8), తలుపూరి మహేంద్ర (ఏ9)లకు రెండు జీవిత కాలాల కఠిన కారాగార శిక్ష (ఏకకాలంలో అమలు) విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ సంచలన తీర్పు వెలువరించారు. వీరిలో సాకే భాస్కర్, సాకే విజయ్‌కుమార్‌లకు రూ.35 వేల చొప్పున, మిగిలిన ఐదుగురికి రూ.30 వేల చొప్పున జరిమానా విధించారు. ఇద్దరు మైనర్లపై జువైనల్ కోర్టులో కేసు నడుస్తోంది. శివారెడ్డి కేసులో సోమవారం తీర్పు వెలువడుతుందనే సమాచారం తెలియడంతో కందుకూరులో ఉదయం నుంచి ఉత్కంఠ నెలకొంది. కేసులో ముద్దాయిలకు శిక్ష విధించారని తెలియగానే గ్రామస్తులంతా 'న్యాయం గెలిచింది' అంటూ సంతోషం వ్యక్తం చేశారు.



హత్యకు గురైన శివారెడ్డి (ఫైల్)



బాధిత కుటుంబ సభ్యులు

చట్టానికి ఎవరూ అతీతులు కారు



కందుకూరు శివారెడ్డి హత్య కేసులో న్యాయం జరిగింది. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఈ కేసుతో మరోసారి నిరూపితమైంది. హంతకుల తరఫున తీవ్రస్థాయిలో బెదిరింపులు వచ్చినా శివారెడ్డి కుటుంబం భయపడకుండా గట్టిగా నిలబడింది. పరిటాల సునీత మంత్రిగా ఉన్న సమయంలో ఈ హత్య జరిగింది. నిందితులకు పరిటాల సునీత గ్రామమైన వెంకటాపురంలో ఆశ్రయం ఇచ్చారు. ఈ కేసులో దోషులను తప్పించే ప్రయత్నం చేశారు. శివారెడ్డి హత్య జరిగిన రోజు మార్చురీ వద్ద నేను ధర్నా చేస్తే నాపై కేసు నమోదు చేశారు. పరిటాల రవీంద్ర హత్య కేసులో ఆ కుటుంబం పోరాడి న్యాయం పొందింది. ఆ తర్వాత జరిగిన హత్యల్లో హంతకుల పక్షాన నిలబడడం బాధాకరం. వారిలోనూ మార్పు రావాలి. బాధితులు భయపడకుండా పోరాడితే కచ్చితంగా న్యాయం జరుగుతుందనేందుకు ఈ కేసు ఒక ఉదాహరణ.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

తోపుదుర్తి కుటుంబం అండగా నిలిచింది

నా సోదరుడి హత్య కేసులో హంతకులకు శిక్ష పడాలనే మా పోరాటానికి తోపుదుర్తి కుటుంబం పూర్తిగా అండగా నిలిచింది. న్యాయం గెలుస్తుంది.. ధైర్యంగా ఉండాలంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చందు, రాజశేఖర్‌రెడ్డి పదేపదే చెప్పారు. దీనికితోడు పోలీసు, న్యాయ వ్యవస్థ బాగా సహకరించాయి. ముద్దాయిలు చాలా కేసుల్లో నిందితులు. రాజీ కాకపోతే మమ్మల్ని చంపుతామంటూ బెదిరింపులు వచ్చాయి. డిపార్ట్‌మెంట్ అండగా నిలబడింది. సమాజానికి చీడపురుగుల్లాంటి వారికి శిక్ష పడాలని మేము చేసిన పోరాటం ఫలించింది. జువైనల్ కోర్టులోనూ ఇద్దరు నిందితులకు శిక్ష పడాలి.

– నరసింహారెడ్డి, శివారెడ్డి సోదరుడు

నా భర్త ఆత్మకు శాంతి చేకూరింది

అకారణంగా నా భర్తను పొట్టన పెట్టుకున్నారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేందుకు మనోధైర్యంతో ముందుకెళ్లాం. న్యాయం గెలిచింది. ముద్దాయిలకు శిక్ష పడడంతో మా ఆయన ఆత్మకు ఈరోజు శాంతి కలిగింది.

– సువర్ణమ్మ, శివారెడ్డి భార్య

నా కళ్ల ముందే హత్య చేశారు..

క్రూర మనస్తత్వం కల్గిన వారు సమాజంలో ఉండటం చాలా ప్రమాదకరం. నాలాగా తండ్రిని కోల్పోయి మరొకరు ఇబ్బంది పడకూడదు. అందుకోసమే హంతకులకు శిక్ష పడాలని గట్టిగా నిలబడ్డాం. ఆ రోజు నా కళ్లముందే నాతండ్రిని హత్య చేశారు. ఈ కేసులో మాకు తోపుదుర్తి కుటుంబం అండగా నిలిచి ధైర్యం నింపింది.

– భానుప్రకాష్‌రెడ్డి, శివారెడ్డి కుమారుడు

ఇదేం బదిలీ ప్రక్రియ బాబోయ్!

- జెడ్పీలో గందరగోళం
- రాత్రి వరకూ పడిగాపులు కాసినా ప్రయోజనం శూన్యం



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. బదిలీలకు సంబంధించిన గడువు ఈ నెల 22తోనే ముగిసింది. కానీ, అందుకు భిన్నంగా 23వ తేదీ సోమవారం కూడా ప్రక్రియ చేపట్టినా, ఒక కొలిక్కి మాత్రం రాలేదు. కచ్చితంగా కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ ఉత్తర్వులు అందజేస్తారని ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు తరలివచ్చారు. అయితే, రాత్రి 10 గంటల వరకు ఎదురు చూసినా సమాధానం చెప్పే వారు కరువవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అధికారుల తీరును తప్పుబట్టారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, బదిలీల కోసం కొందరు ఉద్యోగులు ప్రజాప్రతినిధుల సిఫారసు లెటర్లు తీసుకురాగా, మరికొందరు భారీగా డబ్బు ముట్టజెప్పినట్లు తెలిసింది.

దరఖాస్తులిలా..

ఐదేళ్లు పూర్తి చేసుకొని బదిలీలకు అర్హత కలిగిన వారు మొత్తం 286 మంది ఉన్నారు. ఎంపీడీఓలు ఆరుగురు, 15 మంది ఏఓలు, 26 మంది సీనియర్ అసిస్టెంట్లు, 44 మంది జూనియర్ అసిస్టెంట్లు, 18 మంది టైపిస్టులు, 70 మంది రికార్డు అసిస్టెంట్లు, 20 మంది ల్యాబ్ అసిస్టెంట్లు, 84 మంది అటెండర్లు, ముగ్గురు నైట్ వాచ్‌మెన్లు ఉన్నారు. అన్ని రకాల బదిలీల కోసం మొత్తం 450 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 235 మంది ఉండగా, రిక్వెస్ట్ బదిలీల కోసం 215 దరఖాస్తులు వచ్చాయి.

భారీగా అధికారుల బదిలీలు

- అన్ని శాఖల్లో స్థాన చలనం
- డ్వామా పీడీగా సలీంబాషా నియామకం
- నూతన డీపీఓగా నాగరాజు నాయుడు



అనంతపురం టౌన్: జిల్లాలో భారీగా అధికారుల బదిలీలు జరిగాయి. అన్ని శాఖల్లోనూ ఉద్యోగులకు స్థాన చలనం కలిగింది.

- జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా సలీంబాషాను నియమిస్తూ పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శశి భూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వేణుగోపాల్‌రెడ్డిని మాతృశాఖలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. సలీంబాషా ప్రస్తుతం కర్నూలు డ్వామా కార్యాలయంలో ఏపీడీగా పని చేస్తున్నారు. ఆయనకు డీఎల్‌డీఓగా పదోన్నతి కల్పిస్తూ అనంతపురం డ్వామా పీడీగా బదిలీ చేశారు. జిల్లా డ్వామా కార్యాలయంలో ఏపీడీగా పనిచేస్తున్న వెంకటరత్నంకు డీఎల్‌డీఓగా పదోన్నతి కల్పిస్తూ అన్నమయ్య జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేశారు.
- భూగర్భ గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా గంజి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం జిల్లా నుంచి వెంకటేశ్వర్లు బదిలీపై వస్తున్నారు. ఇక్కడ డీడీగా పని చేస్తున్న నాగయ్యను గనులశాఖ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, గనులశాఖ తాడిపత్రి ఏడీగా ఓబుల్‌రెడ్డిని నియమించారు. ఇక్కడ ఏడీగా పని చేస్తున్న అమీర్‌బాషాను పుట్టపర్తి ఏడీగా బదిలీ చేశారు.

పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గా శ్రీధర్

పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్‌గా జీఎం శ్రీధర్‌ను నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ జీఎంగా పని చేస్తున్న జి.నాగరాజరావును అనకాపల్లి జిల్లా డీఐసీ మేనేజర్‌గా బదిలీ చేశారు.

డీపీఓగా నాగరాజునాయుడు

అనంతపురం రూరల్: జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా నాగరాజునాయుడును నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రభాకర్‌రావును బాపట్ల డీపీఓగా బదిలీ చేశారు.

344 మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

జిల్లాలో 344 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులు 25 మంది, గ్రేడ్ 3–76 మంది, గ్రేడ్ 4–243 మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయ ఏఓ విజయ్‌కుమార్ కడపకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ధర్మవరంలో పని చేస్తున్న నాగరాజు నియమితులయ్యారు.

సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (డీఐజీ) పి.విజయలక్ష్మి తెలిపారు. రమణరావు–అనంతపురం జాయింట్–1,యూనస్–అనంతపురం జాయింట్–2, శ్రీరాములు–అనంతపురం రూరల్, గురునాథ్‌బాబు–శింగనమల, షామీర్–గుంతకల్లు, రాధరమణ–పామిడి, సాధిక్–యాడికి, హనుమేనాయక్–ఉరవకొండ, శ్రీరాములు నాయక్– చెన్నేకొత్తపల్లి, రామలక్ష్మమ్మ–కళ్యాణదుర్గం, కే.శ్రీనివాసులు–రాయదుర్గం, బసవరాజు–కణేకల్లు, తాయన్న–ధర్మవరం, రామ్మోహన్–బుక్కపట్నం, శ్రీనివాసులు– కదిరి, వెంకటనాయుడు–పెనుకొండ, నరసింహమూర్తి–మడకశిర, వెంకటరమణ–చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు.

దంపతుల్ని చిదిమేసిన ఐషర్



హనుమంత రెడ్డి, రంగమ్మ (ఫైల్)



సర్వజనాస్పత్రిలో రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

- అదుపుతప్పి బైకుపై బోల్తా పడ్డ టమాట వాహనం
- ఘటనాస్థలిలోనే దంపతుల దుర్మరణం

అనంతపురం: రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం పాలైన ఘటన నగర శివారు నేషనల్ పార్కు సమీపంలో జరిగింది. వివరాలు.. గుత్తి మండలం అబ్బేదొడ్డికి చెందిన కమతం హనుమంతరెడ్డి (72), కమతం రంగమ్మ (68) దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు జయలక్ష్మి, కాంతమ్మ, కృష్ణకుమారి, ఒక కుమారుడు నాగేశ్వర రెడ్డి సంతానం. అందరికీ పెళ్లిళ్లు జరిగాయి. నాగేశ్వర రెడ్డి సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. అనంతపురంలోని చిన్మయనగర్‌లో నివాసముండే కుమార్తెలను చూసేందుకు ప్రతి వారం హనుమంత రెడ్డి, రంగమ్మ వచ్చి వెళ్లేవారు. ఈ క్రమంలోనే సోమవారం వచ్చి తిరిగి స్వగ్రామం బయలుదేరారు. నేషనల్ పార్కు వద్ద వెళ్తున్న సమయంలో ఓ ఐషర్ వాహనం అదుపుతప్పి బైకుపై పడిపోయింది. తీవ్ర గాయాలైన దంపతులిద్దరూ ఘటనాస్థలిలోనే ప్రాణాలు విడిచారు. ప్రమాద ధాటికి హనుమంతరెడ్డి తల తెగిపోయింది. కక్కలపల్లి మండీలో టమాట బాక్సులు లోడు చేసుకున్న ఐషర్ డ్రైవర్ ముంబైకు వెళ్తున్నట్లు తెలిసింది. నేషనల్ పార్కు సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద వేగం అదుపు కాకపోవడంతో బోల్తా కొట్టి పక్కనే హనుమంత రెడ్డి, రంగమ్మలు వెళ్తున్న బైకుపై పడినట్లు విచారణలో వెల్లడైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న మృతుల కుటుంబీకులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు.



సంఘటనాస్థలంలో గుమిగూడిన ప్రజలు

ఇసుక దందాలో తమ్ముళ్ల పోటీ

- వర్గాలుగా ఏర్పడి సహజవనరుల దోపిడీ
- ఒకరి ట్రాక్టర్లు ఒకరు పట్టిస్తూ పోలీసుస్టేషన్‌లో పంచాయితీ
- ఛీదరించుకుంటున్న ప్రజలు



విడపనకల్లు పోలీసుస్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్



బెళుగుప్ప సమీపంలోని హగరి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

ఉరవకొండ: ఇసుక అక్రమ రవాణాకు టీడీపీ నాయకులు పోటీ పడుతున్నారు. సహజ వనరులను కొల్లగొట్టి జేబులు నింపుకునేందుకు తాపత్రయపడుతున్నారు. దందాలో ఆధిపత్యం కోసం ఎవరికి వారు తహతహలాడుతున్నారు. ఈ క్రమంలోనే ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. స్వయాన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల ఆగడాలను చూసి జనం ఛీదరించుకుంటున్నారు. వివరాలు.. కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వంకల్లో ఇసుక కొల్లగొట్టడం ప్రారంభించారు. ఈ విషయం విడపనకల్లు మండలకేంద్రానికి చెందిన అదే పార్టీ నాయకులకు తెలిసింది. తమకు తెలియకుండా జేబులు నింపుకుంటుండటంతో ఓర్వలేకపోయారు. వారం రోజుల క్రితం స్వయంగా పోలీసులకు సమాచారమిచ్చి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టిచ్చారు. విషయం తెలుసుకున్న కరకముక్కల నాయకులు విడపనకల్లు నాయకులతో వాగ్వాదానికి దిగారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో పంచాయితీ నడిచింది. ఇరువర్గాలు రాజీ కాకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు.

కాపు కాసి.. పట్టించి..

ఇదే క్రమంలో విడపనకల్లు నాయకులు ఇసుక దందాకు తెరలేపారు. తమను పక్కకు నెట్టి అక్రమార్జనకు తెరలేపడంతో కరకముక్కల నాయకులు తట్టుకోలేకపోయారు. ఇటీవల కాపు కాసి మరీ విడపనకల్లు టీడీపీ నాయకులకు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకోవడంతో పాటు వారే దగ్గరుండి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేయాలని ఎస్‌ఐపై ఒత్తిడి తెచ్చారు. తమ ట్రాక్టర్లు పట్టుకున్న వెంటనే కేసు నమోదు చేశారని, ఇప్పుడు ఎందుకు తాత్సారం చేస్తున్నారంటూ దౌర్జన్యం చేయడంతో పోలీసులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకున్నట్లు తెలిసింది.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ..

అధికార అండతో ఉరవకొండ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. పెనక చెర్ల డ్యాంతో పాటు బెళుగుప్ప మండలంలోని పెన్నానది, హగరి నదీ పరివాహక ప్రాంతాల నుంచి జేసీబీలతో ఇసుక తోడేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా సమీపంలోని బళ్లారికి తరలిస్తూ నిత్యం లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. అన్నీ తెలిసినా చర్యలు తీసుకోవడంలో పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధికార పార్టీ వారితో తమకెందుకు అంటూ మిన్నకుండిపోతున్నారు.

మరణిస్తూ మంచిపని!

- దేహాన్ని దానం చేసిన వ్యవసాయ శాస్త్రవేత్త



నరసింహారెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్: ఆయనో వ్యవసాయ శాస్త్రవేత్త. ఉద్యోగంలో ఉన్నన్ని రోజులూ నూతన వంగడాలు కనిపెడుతూ రైతుకు, సమాజానికి ఎంతో ఉపయోగపడ్డారు. పదవీ విరమణ తర్వాత కూడా నిత్యం సమాజం గురించే ఆలోచించేవారు. చివరకు తన ప్రాణం పోయినా ఎందరో మెడికల్ విద్యార్థులకు మేలు జరిగేలా తన దేహాన్ని దానం చేశారు. ఆయనే కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా (1999) పని చేసిన డాక్టర్ పూడూరు నరసింహారెడ్డి(86). వయస్సు మీద పడటంతో సోమవారం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని తన స్వగృహంలో నరసింహారెడ్డి మృతి చెందారు. అయితే ఆయన బతికి ఉన్నప్పుడే మరణానంతరం తన శరీరాన్ని దానం చేయాలని కుటుంబీకులకు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనార్థం కడప రిమ్స్ ఆస్పత్రికి అప్పగించారు. ఇందుకు ఆయన భార్య లీలావతి కూడా పూర్తిగా అనుమతించారు.

క్లుప్తంగా

భూసేకరణ వివాదాలు పరిష్కరించండి : జేసీ

అనంతపురం అర్బన్: వివిధ ప్రాజెక్టుల కోసం చేపట్టిన భూసేకరణకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జేసీ శివనారాయణ శర్మ ఆదేశించారు. భూసేకరణ అంశంపై సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. సమావేశంలో ఆర్‌డీఓలు శ్రీనివాసులురెడ్డి, వసంతబాబు, భూపరిపాలన విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఎన్‌హెచ్ 544డి, ఎన్‌హెచ్ 42, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్, ఏపీ ట్రాన్స్‌కో, రైల్వే, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

జూడో ఓవరాల్ చాంపియన్ 'అనంత'

తిరుపతి ఎడ్యుకేషన్: స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల జూడో పోటీలు సోమవారంతో ముగిశాయి. క్రీడాకారుల బరువు ఆధారంగా ఏడు కేటగిరీల్లో పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను అనంతపురం జిల్లా బాలబాలికలు దక్కించుకున్నారు. బాలుర విభాగంలో కర్నూలు జిల్లా, గుంటూరు జిల్లా, బాలికల విభాగంలో చిత్తూరు, నెల్లూరు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. కాగా, జాతీయ స్థాయి పోటీలకు అనంతపురానికి చెందిన టి.జయసింహ, ఎస్.దర్శన్ తేజ, డి.యశ్వంత్, ఎం.విక్రాంత్, ఎస్‌ఏ.మీరజ్, ఎ.అక్షయేణి, ఎస్.మీరా జాస్మిన్, బి.నాగశ్వేత, బి.ప్రవల్లిక, బి.కావ్య ఎంపికయ్యారు.

వినతులను నిర్లక్ష్యం చేయొద్దు

- ప్రతి సమస్యకూ సంతృప్తికర పరిష్కారం చూపాలి
- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
- పరిష్కార వేదికకు 510 వినతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (చిత్రంలో) జేసీ శివనారాయణశర్మ

అనంతపురం అర్బన్: ప్రజలు సమర్పిస్తున్న వినతులను ఏ దశలోనూ నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి సమస్యకూ సంతృప్తికర పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 510 వినతులు అందాయి. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు శిరీష, కరుణకుమారి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ వినతులు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. పరిష్కారం కాకుండానే పరిష్కరించినట్లు కొందరు అధికారులు చూపిస్తున్నారని, ఇలాంటి అర్జీలు రీ-ఓపెన్ అవుతాయని అసహనం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు.

వినతులు కొన్ని...

- జీవనోపాధి కోసం తనకు కేటాయించిన దుకాణపు గదిని కొందరు దౌర్జన్యంగా తీసుకుని బెదిరిస్తున్నారని అనంతపురానికి మరుగుజ్జు దివ్యాంగుడు ఎం.మద్దిలేటి వాపోయాడు. 2018లో అప్పటి కలెక్టర్ జి.వీరపాండియన్ తనకు సాంఘిక సంక్షేమ శాఖ దుకాణ సముదాయాల్లో ఓ గదిని కేటాయించారని, అయితే కొందరు దళిత సంఘాల నాయకులు ఈ గదిని దౌర్జన్యంగా తీసుకుని బెదిరిస్తున్నారని వివరించాడు. తనకు కేటాయించిన గదిని వారి నుంచి ఇప్పించి ఆదుకోవాలని విన్నవించాడు.
- తమకు మంజూరు చేసిన ఇంటిస్థలాలను ఓ వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని అంగన్‌వాడీలు ఫిర్యాదు చేశారు. 2011లో ఉప్పరపల్లి పొలంలో సర్వే నెంబరు 107/1లో ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చారన్నారు. 2018లో ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసిందన్నారు. 2011లో వేసిన హద్దురాళ్లు తొలగించారని, తిరిగి సర్వే చేసి హద్దు ఏర్పాటు చేయాలని కోరితే సర్వేయర్ రాలేదన్నారు. ఈ స్థలం తనదంటూ ఓ వ్యక్తి దౌర్జన్యం చేస్తూ నాటుకున్న బండలను పగులగొట్టాడని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం తమకు కేటాయించిన స్థలాలను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- వితంతు పింఛను మంజూరు చేయించండంటూ అనంతపురంలోని గంగానగర్‌కు చెందిన కె.నాగవేణి విన్నవించింది. అనారోగ్యంతో తన భర్త 2023లో మరణించాడని, తమకు ఇద్దరు సంతానం కాగా, కూలి పనులతో జీవనం సాగిస్తున్నట్లు వివరించింది. నిరుపేదనైన తనకు వితంతు పింఛను మంజూరు చేయించి ఆదుకోవాలని కోరింది.

రైతు సంక్షేమమే లక్ష్యంగా కార్యక్రమాలు

రైతు సంక్షేమమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ కార్యక్రమానికి సంబంధించి పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. అలాగే 'మీ విజన్- మా మిషన్' అంటూ రూపొందించిన స్వర్ణాంధ్ర పోస్టర్లనూ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే అనంత పరామర్శ


కేతిరెడ్డిని పరామర్శిస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి

ధర్మవరం రూరల్: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. సోమవారం ధర్మవరంలోని సబ్ జైలులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శించేందుకు వెళ్లిన కేతిరెడ్డిని కూటమి నేతలు అడ్డుకున్నారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. విషయం తెలుసుకున్న అనంత వెంకటరామిరెడ్డి ధర్మవరానికి చేరుకుని కేతిరెడ్డిని కలిసి ఘటనపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో కూటమి సర్కార్ విఫలమైందని మండిపడ్డారు. దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

25న కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

బుక్కరాయసముద్రం: రైతు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం, కొర్రపాడు, రెడ్డిపల్లి గ్రామాలలో సోమవారం ఆయన కరపత్రాలను పంపిణీ చేసి, మాట్లాడారు. రైతుల డిమాండ్ల సాధనకు ఈ నెల 25న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

30న చేనేతల ధర్నా

పెద్దపప్పూరు: గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని కొనసాగించాలంటూ జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప డిమాండ్ చేశారు. పెద్దపప్పూరు మండలం కుమ్మెత గ్రామంలో సోమవారం నేతన్నలతో ఆయన సమావేశమై మాట్లాడారు. డిమాండ్ సాధనలో భాగంగా ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ నోటిఫికేషన్ జారీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా నిర్మించ తలపెట్టిన పలు రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియకు కేంద్ర రైల్వేశాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం అనంతపురం జిల్లాలోని గుత్తి స్టేషన్ యార్డ్ వద్ద లెవల్ క్రాసింగ్ నెం. 179 కి బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి భూసేకరణకు అనుమతులు మంజూరయ్యాయి.

వృద్ధురాలి మెడలో నగ అపహరణ

రాప్తాడు రూరల్: వృద్ధురాలి మెడలోని బంగారు నగను ఓ దుండగుడు లాక్కొని ఉడాయించాడు. పోలీసులు తెలిపిన మేరకు... 74 ఏళ్ల వయసున్న నాగరత్నమ్మ అనంతపురం రూరల్ మండలం వివేకానందనగర్‌లో నివాసముంటున్న తన కుమార్తె ప్రభావతితో కలసి ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి ఎదుట వృద్ధురాలు చెత్తను శుభ్రం చేస్తుండగా ఓ దుండగుడు వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని బంగారు నగను లాక్కొనే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన నాగరత్నమ్మ చైన్‌ను చేతితో పట్టుకుంది. అదే సమయంలో దుండగుడు బలంగా లాగి చేతికి చిక్కిన సగం చైన్‌తో ద్విచక్రవాహనంపై వేచి ఉన్న తన సహచరుడితో కలసి ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రేడ్-1 వీఆర్వోల బదిలీ

అనంతపురం అర్బన్: జిల్లా రెవెన్యూ శాఖలో గ్రేడ్-1 వీఆర్వోలుగా పనిచేస్తున్న 188 మందిని బదిలీ చేస్తూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న మండలంలోనే మరొక గ్రామానికి కొందరు, పొరుగు మండలానికి మరికొందరు బదిలీ అయ్యారు. మరికొందరిని ఇతర నియోజకవర్గాల్లోని మండలాలకు బదిలీ చేశారు.

భారీగా ఎంపీడీఓల బదిలీలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒకేసారి 40 మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతితో ఈ బదిలీలు పూర్తి చేశారు. ఎంపీడీఓల బదిలీల జాబితాను జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ సోమవారం రాత్రి విడుదల చేశారు. బీకేఎస్‌లో పనిచేస్తున్న కె.తేజోష్ణను పామిడికి, అక్కడ పనిచేస్తున్న డి.ప్రభాకర్‌ను గుత్తికి బదిలీ చేశారు. రాప్తాడులో పనిచేస్తున్న జె.స్మాలన్‌ను బీకేఎస్‌కు కేటాయించారు. కదిరి రూరల్ నుంచి జి.శ్రీకాంత్ చౌదరిని గుంతకల్లు రూరల్‌కు, బెళుగుప్ప నుంచి జి.ఎస్.రామచంద్రను కళ్యాణదుర్గం రూరల్‌కు, పెద్దపప్పూరు నుంచి బి.రామకృష్ణను శెట్టూరుకు, నార్పలలో పనిచేస్తున్న పి.దివాకర్‌ను అనంతపురం రూరల్‌కు, కుందుర్పి నుంచి జి.లక్ష్మీనరసింహను ఆత్మకూరుకు బదిలీ చేశారు. తాడిపత్రి రూరల్ నుంచి ఎ.వి.రంగారావును తాడిమర్రికి, అక్కడి నుంచి బి.విజయలక్ష్మిని రాప్తాడుకు, నల్లమాడ నుంచి ఎం.కొండన్నను రాయదుర్గానికి, కనగానపల్లి నుంచి టి.అలివేలమ్మను పుట్లూరుకు, అక్కడి నుంచి టి.యోగానందరెడ్డిని గార్లదిన్నెకు, ధర్మవరం రూరల్ నుంచి పి.సౌజన్యను యల్లనూరుకు, అక్కడ పనిచేస్తున్న వీర్రాజును యాడికికి, అక్కడ పనిచేస్తున్న టి.లక్ష్మీనారాయణను బెళుగుప్పకు, కొత్తచెరువు నుంచి బారాన్‌సాహెబ్‌ను పెద్దవడుగూరుకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న పి.కుళ్లాయిస్వామిని కూడేరుకు, అగళి నుంచి బి.వి.రవిప్రసాద్‌ను ఉరవకొండకు, బొమ్మనహాళ్ నుంచి ఎస్.షకీలా బేగంను విడపనకల్లుకు, అక్కడ పనిచేస్తున్న ఎ.వి.శ్రీనివాసులును బుక్కపట్నానికి, లేపాక్షి నుంచి ఎం.నరసింహనాయుడును బత్తలపల్లికి, అక్కడ పనిచేస్తున్న ఎస్.సాయి మనోహర్‌ను ధర్మవరానికి, గార్లదిన్నె నుంచి డి.విజయభాస్కర్‌ను ముదిగుబ్బకు, అక్కడ పనిచేస్తున్న కె.వి.కవిరాజును రొళ్లకు, గోరంట్ల నుంచి ఎన్.రఘునాథగుప్తను నల్లచెరువుకు, అక్కడ పనిచేస్తున్న వి.శకుంతలను పెద్దపప్పూరుకు, పెనుకొండ నుంచి ఎన్.శివశంకరప్పను చెన్నేకొత్తపల్లికి, అక్కడ పనిచేస్తున్న ఎస్.గంగావతిని నార్పలకు బదిలీ చేశారు. గుమ్మఘట్ట నుంచి ఎస్.నరసింహమూర్తికి లేపాక్షి, గుడిబండ నుంచి డి.రామారావుకు అమరాపురం, హిందూపురం రూరల్ నుంచి పి.నరేంద్రకుమార్‌కు గోరంట్ల, పరిగిలో పనిచేస్తున్న వి.సరస్వతికి సోమందేపల్లి, రొద్దం నుంచి రాబర్ట్ విల్సన్‌కు ఓడీసీ, రొళ్ల నుంచి ఆజాద్‌కు రామగిరికి, బ్రహ్మసముద్రంలో పనిచేస్తున్న దాసానాయక్‌కు డి.హీరేహాళ్ కేటాయించారు. ఇక అంతర్ జిల్లా నుంచి అగళికి ఎస్.యాదవేంద్ర, కదిరి రూరల్‌కు పి.పోలప్పల్, గాండ్లపెంటకు బి.వెంకట్రామిరెడ్డి బదిలీపై రానున్నారు.

ప్రభుత్వ పెద్దలూ.. మా గతేంటి?

- అక్టోబర్ నుంచి మద్యం కొత్త పాలసీ అమలు
- దుకాణాల కోసం తెలుగు తమ్ముళ్ల ప్రయత్నాలు
- ప్రస్తుతం ప్రభుత్వ షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది భవిష్యత్తు ప్రశ్నార్థకం

అనంతపురం: మద్యం పాలసీ అంటూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కొందరి జీవితాల పాలిట శాపంగా మారింది. ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వందలాది మంది చిరుద్యోగుల గురించి స్పష్టత ఇవ్వకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మద్యం విక్రయాలను నియంత్రించేలా దుకాణాలను గత ప్రభుత్వమే స్వయంగా నిర్వహిస్తూ వచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మద్యం పాలసీని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రైవేట్ వ్యక్తులకు దుకాణాలను అప్పగించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అమలులో ఉన్న మద్యం పాలసీని, అందులో లోటుపాట్లను పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశించింది. దీంతో కమిటీలు ఆయా రాష్ట్రాలకు వెళ్లి స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశాయి. ఈ క్రమంలో అక్టోబర్ 1 నుంచి నూతన పాలసీని అమలులోకి తీసుకువచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం రంగం సిద్ధమైంది.

ఆందోళనలో సిబ్బంది

నూతన పాలసీ విధానం పేరుతో తమను రోడ్డు పాలు చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నుతోందనే ఆందోళన ప్రస్తుతం మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇప్పటి వరకూ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే తమ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని వాపోతున్నారు. ఒక్కో షాపులో సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. దుకాణాలకు వాచ్‌మెన్లు సైతం ఉన్నారు. మొత్తం జిల్లాలో 750 మంది ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నారు.

వారికే షాపులు

అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ దుకాణాలను తొలగించి గతంలోలా ప్రైవేట్ దుకాణాల ఏర్పాటు చేయనున్నారు. దీంతో కూటమి నేతలు ఇప్పటి నుంచే షాపులను దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ప్రైవేట్ షాపుల విషయంలో టెండర్ల ప్రక్రియ ఎలా ఉంటుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోలా లక్కీ డిప్ ద్వారా షాపులు కేటాయిస్తారా? టెండర్ల ప్రక్రియను బార్లకు నిర్వహించినట్లు ఆన్‌లైన్‌లోనే వైన్‌షాపులకు నిర్వహిస్తారా? అనేది తేలాల్సి ఉంది. అయితే కొన్ని నియోజకవర్గాల్లో తమకు తెలియకుండా ఎవరూ దుకాణాలకు యత్నించరాదని ఇప్పటికే కూటమి నేతలు హుకుం జారీ చేసినట్లు ప్రచారం సాగుతోంది.

నీటి వనరులపై ప్రభుత్వం దాగుడు మూతలు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్


అనంతపురం అర్బన్: తుంగభద్ర, హంద్రీ-నీవాల నుంచి జిల్లాకు పూర్తిస్థాయిలో నీటిని తీసుకువచ్చే అంశంపై కూటమి ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మండిపడ్డారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు నీటిని సమీకరించి, ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడంలో ప్రభుత్వం వద్ద స్పష్టత లేదని విషయాన్ని మంత్రుల తీరు స్పష్టం చేస్తోందన్నారు. హెచ్చెల్సీ ఆధునీకరణ, హంద్రీ-నీవా ఆయకట్టు భూములకు సాగునీరు విషయంలో నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఎందుకు స్పష్టంగా ప్రకటించలేదని ప్రశ్నించారు. తుంగభద్ర డ్యామ్ పొంగి పొర్లుతున్నా జిల్లాకు కేటాయించిన నీటిని తెచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రతి ఎకరాకు నీరు ఇస్తామని మంత్రి నిమ్మల చెప్పారని, అయితే ప్రతి ఎకరాకు నీరు ఎలా ఇస్తారో చెప్పకుండా కేవలం ప్రకటన చేస్తే ఉపయోగం ఉండదన్నారు. తుంగభద్ర డ్యామ్ భద్రతపై ఆర్‌ఆర్ బజాజ్ ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం ఏమి చే యనుందో చెప్పాలన్నారు. హెచ్చెల్సీ ఆధునీకీకరణ పనులు పూర్తి చేస్తారో లేదో చెప్పకుండా రాజకీయ విమర్శలు చేయడం వల్ల జిల్లా ప్రజలకు ఏమి ప్రయోజనమని ప్రశ్నించారు. శ్రీశైలం డ్యామ్ నిండినా హంద్రీ-నీవా కాలువ సామర్థ్యంలో సగానికి కూడా నీరు వచ్చే పరిస్థితి లేదని మంత్రి ప్రకటించడం జిల్లా రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందన్నారు. రోజూ 380 క్యూసెక్కులు మాత్రమే వస్తే జిల్లాలోని చెరువులు, కుంటలను నింపే అవకాశం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా నీటిపారుదల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు విస్తృతం చేస్తామని హెచ్చరించారు.

విహారయాత్రలో విషాదం


నరసింహారెడ్డి (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక శారదానగర్‌లో నివాసముంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి (62) విహారయాత్రలో చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాలు... నార్పల మండలం బి.బండ్లపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సోషల్ టీచర్‌గా పని చేస్తూ గత ఆగస్టు 31న ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో పది మంది స్నేహితులతో కలసి మూడు రోజుల క్రితం రెండు వాహనాల్లో గోవా యాత్రకు వెళ్లారు. కర్ణాటకలోని హొస్పేట సమీపంలో ఓ వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఆ వాహనంలో ప్రయాణిస్తున్న నరసింహారెడ్డి ఛాతికి బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను హొస్పేటలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం తెల్లవారుజామున మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు.

బాలుడి అదృశ్యం


చీమల తరుణ్

తాడిమర్రి: మండలంలోని మర్రిమాకులపల్లికి చెందిన చీమల బయన్న కుమారుడు తరుణ్ కనిపించడం లేదు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపరంలోని శ్రీసత్యసాయి కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తరుణ్... అక్కడే హాస్టల్‌లో ఉండేవాడు. ఈ క్రమంలో ఎవరికీ చెప్పకుండా ఈ నెల 20న మధ్యాహ్నం స్వగ్రామానికి చేరుకోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు.... అదే రోజు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు గాలిస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 01893, 92811 07077కు సమాచారం అందించాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. మొత్తం 84 అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అనంతపురంలో 8, శింగనమలలో 6, నార్పలలో 9, అనంతపురం రూరల్‌లో 10, తాడిపత్రిలో 14, గుత్తిలో 5, ఉరవకొండలో 12, కళ్యాణదుర్గంలో 6, కణేకల్లులో 5, కంబదూరులో 7, రాయదుర్గంలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోస్టులకు సంబంధించి రోస్టర్ పాయింట్లు, ఖాళీల జాబితాను ఆయా సీడీపీఓ కార్యాలయాల్లోని నోటీసుబోర్డుల్లో అందుబాటులో ఉంచారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు అక్టోబర్ 1వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలి. కాగా, అనంతపురం అర్బన్ పరిధిలోని ఎర్రనేల కొట్టాల-2 అంగన్‌వాడీ వర్కర్ పోస్టు (ఓసీ), నెహ్రూ పూర్‌మెన్ కాలనీ-3(ఓసీ), అరుణోదయకాలనీ(ఎస్సీ), జనశక్తి నగర్-2(ఓసీ), గుల్జార్‌పేట (బీసీ-ఎ), ప్రకాష్‌రోడ్డు(ఓసీ), కృష్ణానందనగర్-1(వీహెచ్), వినాయకనగర్-1(ఎస్సీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు సీడీపీఓ లలితమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు అక్టోబర్ 1లోపు సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

సర్.. మేడమ్ అంతే!

- ఫోన్ కాల్స్‌కు స్పందించని విద్యాశాఖ పెద్ద మేడమ్
- పర్సనల్ నంబర్‌కు కాల్ చేస్తే తన వ్యక్తిగత నంబర్‌కు ఎవరు చేయమన్నారంటూ మండిపాటు



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి పనితీరు నానాటికీ వివాదస్పదంగానే ఉంటోంది. బాధ్యతాయుతమైన హోదాలో ఉంటున్న ఆమె... తన శాఖలోని ఉద్యోగులు వృత్తిపరంగా ఏమైనా ఇబ్బందులు తలెత్తి పరిష్కారం కోసం ఫోన్ చేస్తే అస్సలు స్పందించరు. ఎవరు ఎన్నిమార్లు ఫోన్లు చేసినా పట్టించుకోరు. దీంతో ఆ శాఖలోని ఉద్యోగులు బేజారెత్తిపోయారు. చివరకు ఓ ప్రజాప్రతినిధి పలు మార్లు ఫోన్ చేసినా ఆమె కాల్ రిసీవ్ చేయకపోవడంతో విసుగు చెందిన సదరు ప్రజాప్రతినిధి... విషయాన్ని నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

నేరుగా వచ్చినా...

జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రభుత్వం ఒక మొబైల్ నంబరు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ ఫోన్ నుంచి తనకు అవసరమైనప్పుడు మాత్రమే ఆమె ఫోన్లు చేస్తుంది తప్ప ఎవరైనా ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే మాత్రం లిఫ్ట్ చేయరు. ఇదే విషయాన్ని డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు, డీఈఓ, సమగ్రశిక్ష కార్యాలయాల ఉద్యోగులు బాహాటంగానే చెబుతున్నారు. ఏదైనా ముఖ్యమైనా ఫైలు విషయంలో సందేహం నివృత్తి చేసుకోవాలంటే ఆమెను నేరుగా కలసి మాట్లాడాలి తప్ప ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా పనులు కాస్త పెండింగ్‌లో పడిపోతున్నాయంటున్నారు. ఇక ప్రజలు, విద్యార్థి సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధుల సంగతి దేవుడికెరక. రాయదుర్గం ప్రాంతంలోని ఓ కార్పొరేట్ పాఠశాల నిర్వాకంపై ఫిర్యాదు చేసేందుకు కొందరు ఇటీవల పలుమార్లు ఫోన్ చేసినా డీఈఓ స్పందించకపోవడంతో చివరకు నేరుగా కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో డీఈఓ అందుబాటులో లేకపోవడంతో ఉసూరుమంటూ వెళ్లిపోయారు. ఇలాంటి బాధితులు కోకొల్లలుగా ఉన్నారు.

మేడమ్ కలెక్టర్ వద్ద ఉన్నారంటూ...

కింది స్థాయి ఉద్యోగులపై కేకలు వేయడం, వారిపై అజమాయిషీ చేయడం తప్ప వరలక్ష్మి ఏనాడూ డీఈఓ హోదాలో బాధ్యతలు నిర్వర్తించిన దాఖలాలు లేవని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఆమెకు కేటాయించిన నంబర్‌కు పలుమార్లు ఫోన్లు చేసినా స్పందించకపోవడంతో చివరకు డీఈఓ వ్యక్తిగత నంబర్‌కు కాల్ చేసి చీవాట్లు తినాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇది తన వ్యక్తిగత నంబర్ అని, ఈ నంబర్‌కు ఎందుకు కాల్ చేస్తున్నారంటూ చిందులు వేసే ఆమె... ప్రభుత్వం జారీ చేసిన నంబర్‌కు చేస్తే మాత్రం పక్కన పడేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. చివరకు క్యాంప్ క్లర్క్ (సీసీ)కు ఫోన్ చేస్తే... 'మేడమ్ బిజీగా ఉన్నారు' అని ఒకసారి, 'కలెక్టర్ వద్ద ఉన్నారు' అంటూ మరోసారి చెప్పి.. తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ డీఈఓ కార్యాలయంలోని ఓ సూపరింటెండెంట్, సమగ్ర శిక్షలోని ఓ ఉద్యోగి పేర్కొన్నారు. ఇదే అంశంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై వివరణ కోరేందుకు 'సాక్షి' పలుమార్లు డీఈఓ వరలక్ష్మికి ఫోన్ చేసినా ఆమె స్పందించకపోవడం విశేషం.

> 'విద్యాశాఖ అనేది అతి పెద్ద వ్యవస్థ. హెచ్‌ఎం మొదలుకొని జిల్లా అధికారి వరకూ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పనులు పడుతూనే ఉంటాయి. ఎవరు ఏ సమయంలో ఫోన్ చేసినా లిఫ్ట్ చేసి మాట్లాడి సమస్య తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకోవాలి. ఇదే విషయంపై విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.'
> – ఇటీవల జిల్లా సమీక్షలో పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ చేసిన వ్యాఖ్యలు

కొసమెరుపు...

ఏ సమయంలో హెచ్‌ఎం మొదలుకొని జిల్లా అధికారి వరకూ ఎవరు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేసి సమాధానం ఇవ్వాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం ఉపేక్షించబోమంటూ హితబోధ చేసిన ఆర్జేడీ శామ్యూల్ వద్ద డీఈఓ వరలక్ష్మి తీరుపై పలువురు ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయితే సమస్య పూర్తిగా విన్న ఆయన సైతం దీనిపై స్పష్టమైన పరిష్కారం చూపకపోవడం కొసమెరుపు.

క్లుప్తంగా

ఐటీఐ సూపరింటెండెంట్‌కు అభినందన



రఘునాథ ప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

అనంతపురం ఎడ్యుకేషన్: మెగా సూపర్ సింగర్ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చాటిన స్థానిక బాలుర ఐటీఐ సూపరింటెండెంట్ రఘునాథ ప్రసాద్‌ను సిబ్బంది అభినందించారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన 'మధు మెలోడీస్ సూపర్ సింగర్' కార్యక్రమంలో పాల్గొన్న రఘునాథ ప్రసాద్ మధుర గీతాల్ని ఆలపించారు. ఉత్తమ గాయకులుగా ఎన్నికైన వారిలో ఏపీ తరఫున రఘునాథప్రసాద్ ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం ఐటీఐలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

2 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీజగద్గురు శంకర శృంగేరి విరూపాక్ష దత్తాత్రేయ మహా సంస్థానంలో అక్టోబర్ 2 నుంచి 11 వరకూ శరన్నవ రాత్రి ఉత్సవాలు జరుగుతాయని పీఠాధిపతి విద్యానృసింహ సరస్వతీ స్వామీజీ తెలిపారు. ఈ మేరకు సోమవారం సంస్థానంలో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రతి నిత్యం ఉదయం చండీ పారాయణం, మహానివారణ అర్చన, సుహాసినులచే లలితా సహస్రనామ కుంకుమార్చన, సాయంత్రం 4 గంటలకు లలితా సహస్రనామ పారాయణం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయని పేర్కొన్నారు. 11వ తేదీన లోక కల్యాణార్థం చండీ హోమం ఉంటుందని పేర్కొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనంతపురం రూరల్: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అన్నారు. సోమవారం రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలోని పొట్టి శ్రీరాములు కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. బాలింతలు, గర్భవతులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పండ్లు, కూరగాయలు, గుడ్లతో పాటు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తరచూ తీసుకోవాలని సూచించారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ సిబ్బంది గుర్తించి వారి ఎదుగుదలకు సరైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది నిర్మల, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏఈని నియమించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కనగానపల్లి: విద్యుత్‌శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)ను నియమించాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ నాయకుడు మహదేవ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో విద్యుత్ సమస్యలపై తహసీల్దార్ రమాదేవి వినతిపత్రం అందజేశారు. మండలంలో రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో విద్యుత్ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రైతులు, సామాన్య ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి వెంటనే రెగ్యులర్ ఏఈని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కారదర్శి బాలరాజు, రైతు సంఘం అధ్యక్షుడు పసల నాగరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

జోరుగా ఈ-కేవైసీ



ఆత్మకూరులో ఈ-కేవైసీ చేయిస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో సోమవారం వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-కేవైసీ నమోదు చేశారు. ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకుని.. ఇంకా ఈ-కేవైసీ చేయించని రైతులకు ఫోన్ చేసి మరీ ఈ-కేవైసీ చేయించినట్లు వ్యవసాయ అధికారి సుచరిత తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఇప్పటికే ఈ-క్రాప్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీకి సోమవారం ఆఖరు తేదీ కావడంతో రైతు సేవా కేంద్రాలకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

తగిలితే షాకే..

రాప్తాడు పంచాయితీలోని ముస్లిం మైనార్టీ కాలనీలో మసీదు ఎదురుగా ఉన్న వీధిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ తీగలు ఇంటి ముందు చేతికందే ఎత్తులో ఉన్నాయి. తలపై ఏదైనా వస్తువును ఇంట్లోకి ఎత్తుకుని వచ్చే వారికి విద్యుత్ తీగలు తగులుతున్నాయి. చాలా మంది కాలనీ వాసులు ఇంటి ముందు వెళ్తున్న విద్యుత్ వైర్లకు పీవీసీ పైపులు వేసుకుని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వర్షం వచ్చినప్పుడు విద్యుత్ షాక్ కొట్టినట్లు సమాచారం. విద్యుత్ వైర్లు ఇంటి ముందు లేకుండా మార్చాలని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరి చేయాలని కోరుతున్నారు. – రాప్తాడు:



ఇంటి ముందు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

కనగానపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. సోమవారం క్రీడా పోటీల నిర్వహణపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, పీఈటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల వారీగా ఎంపిక చేసిన క్రీడాకారులందరూ పాల్గొనాలని పీడీ రమేష్ సూచించారు. క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు.

అనంతను ప్రగతి పథంలో తీసుకెళ్తాం



ఢిల్లీలో జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, సవాళ్లను అధిగమించి అనంతను ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మేయర్ వసీం పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఇండియా హేబిటేట్ సెంటర్‌లో సోమవారం జరిగిన సదస్సులో మేయర్ ప్రసంగించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో నగరంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. శిథిలావస్థకు చేరిన టవర్‌క్లాక్ బ్రిడ్జ్ స్థానంలో నూతన బ్రిడ్జ్, అండర్ పాస్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో అనంతపురం నగరంలో ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు చేస్తే ప్రజలకు కొంత ఉపయుక్తంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ఉన్నామన్నారు. అదేవిధంగా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి తాగునీరు, వీధిలైట్లకు విద్యుత్ తగ్గించే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం చేయాలంటే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ద్వారా చేపడితే వేగంగా పూర్తి అవుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

'స్వచ్ఛతా హీ సేవా'కు డుమ్మా

- కార్యక్రమానికి హాజరుకాని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కార్పొరేషన్: 'అనంత' నగరాభివృద్ధికి ఉపయోగపడే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై టీడీపీ ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం నగరంలోని బిందెల కాలనీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. ఉదయం నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు, సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులతో పాటు స్థానిక ప్రజలను పెద్ద ఎత్తున మొబులైజ్ చేశారు. కాగా ఉదయం 8:30 గంటలకే కార్యక్రమం అని నగరపాలక సంస్థ అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కానీ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అటువైపు తొంగిచూడలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి సదరు ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వాస్తవంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పారిశుధ్యం మెరుగు చర్యలు చేపట్టి వాటిని యాప్‌లో పొందుపర్చాలి. తద్వారా ర్యాంకులు వస్తాయి. ఆ ర్యాంకుల ఆధారంగా భవిష్యత్తులో నగరపాలక సంస్థకు గ్రేడింగ్ వచ్చి, నిధులు వచ్చే అవకాశం లేకపోలేదు. దేశంలోనే గుర్తింపు లభిస్తుంది. అటువంటి కార్యక్రమంపై కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులు తేలిగ్గా తీసుకున్నారు. పారిశుధ్యం మెరుగుపై ప్రజాప్రతినిధులకు ఏపాటి చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతుందని చెప్పొచ్చు. చివరకు నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, తదితర స్థానికులు పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు.

'అనంత'ను కలిసిన వైవీఆర్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు గుంతకల్లు నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను పార్టీ జిల్లా అధ్యక్షుడు 'అనంత'కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మాంఛో ఫెర్రర్‌కు సన్మానం



ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను సన్మానిస్తున్న ఎల్ఆర్‌జీ పూర్వ విద్యార్థులు

అనంతపురం: అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో 22 రోజుల పాటు దులీప్ ట్రోఫీని విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను ఎల్ఆర్‌జీ స్కూల్ పూర్వ విద్యార్థులు సోమవారం సన్మానించారు. జాతీయ స్థాయిలో మన జిల్లా కీర్తిని చాటిచెప్పిన మాంఛోకు ఈ ప్రాంతమంతా రుణపడి ఉంటుందని ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధ వీఎం రవిశంకర్ అన్నారు. త్వరలో అంతర్జాతీయ మహిళా క్రికెట్ అనంతపురంలో నిర్వహించే అవకాశం ఉన్నట్లు మాంఛో ఫెర్రర్ ప్రకటించారు.

నగరాభివృద్ధికి చర్యలు తీసుకోండి



ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో మురికివాడలు, రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసి, నగరాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం నగరపాలక సంస్థలో జరిగిన స్పందన కార్యక్రమానికి ఎమ్మెల్యే దగ్గుపాటి హాజరయ్యారు. ఇందిరాగాంధీ నగర్ నుంచి ఆర్‌కే నగర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న కచ్చా రోడ్డును సీసీ రోడ్డుగా మార్చాలన్నారు. గత 40 ఏళ్లుగా రాకపోకలు సాగుతున్న రోడ్డు తమదంటూ ఇటీవల కొందరు తెరపైకి వచ్చారన్నారు. దానిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రోడ్లు కబ్జా కాకుండా చూడాలన్నారు. సీపీఎం నాయకులు రామిరెడ్డి, ప్రకాష్, నూరుల్లా, రాము, జగదీష్, లోకేష్, బండి సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగరపాలక సంస్థ కార్మికులు తమకు పనిముట్లు ఇప్పించాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు.

స్వర్ణాంధ్ర 2047 వార్డు సభ ఫ్లాప్..

కూటమి ప్రభుత్వం పిలుపునిచ్చిన స్వర్ణాంధ్ర 2047 వార్డు సభకు స్పందన కరువైంది. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, నగరపాలక సంస్థ అధికారులు సాయినగర్‌లో వార్డు సభను ఏర్పాటు చేశారు. కాగా స్థానిక ప్రజలు దీనిపై ఆసక్తి చూపలేదు. కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'టీచర్లను వేధిస్తున్న పామిడి ఎంఈఓ'



డీఈఓ వరలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్లను వేధిస్తున్న పామిడి ఎంఈఓ-1 జయానాయక్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డీఈఓ వరలక్ష్మిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఏడేళ్లుగా అక్కడే పని చేస్తున్న జయానాయక్ వ్యక్తిగత, సామూహిక సమస్యలను సృష్టిస్తూ టీచర్ల ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు. పని సర్దుబాటులో సమస్యలను పరిష్కరించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రశ్నించిన ఉపాధ్యాయ సంఘాల నాయకులపై కక్ష పూరితంగా వ్యవహరించారన్నారు. విచారణ చేయించి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లింగమయ్య, గోవింద రాజులు, బీఈడీ అసోసియేషన్ లింగమూర్తి, డీటీఎఫ్ జార్జ్, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

ఏసీపీగా శ్రీనివాసులు

- నగరపాలక సంస్థలో అధికారుల బదిలీలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా శ్రీనివాసులు నియమితులయ్యారు. తిరుపతిలో ఏసీపీగా ఉన్న ఈయన బదిలీపై నగరపాలక సంస్థకు రానున్నారు. గతంలో ఈయన అనంతపురంలో ఏసీపీగా పని చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఏసీపీ మారుతీ హరిప్రసాద్ ఏపీ టిడ్కో డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. అదేవిధంగా కర్నూలులో టీపీఎస్‌గా పని చేస్తున్న మంజులమ్మ నగరపాలక సంస్థ టీపీఎస్‌గా నియమితులయ్యారు.

ఎస్ఈగా భాస్కర్ రావు..

నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా భాస్కర్‌రావు నియమితులయ్యారు. విజయవాడ రెరాలో ఎస్ఈగా ఉన్న ఈయన బదిలీపై నగరపాలక సంస్థకు రానున్నారు. అదేవిధంగా ఇక్కడ పని చేస్తున్న ఈఈలు సూర్యనారాయణ, సుధారాణి ఏపీ టిడ్కో విజయవాడకు బదిలీ అయ్యారు. కర్నూలు నగరపాలక సంస్థ నుంచి షాకీర్ హుస్సేన్, సెలవులో ఉన్న రాధాకృష్ణ నగరపాలక సంస్థ ఈఈలుగా నియమితులయ్యారు.

ఇళ్ల పట్టాలిచ్చి ఆదుకోండి



తహసీల్దార్ మోహన్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రాప్తాడురూరల్: గుడిసెలు వేసుకుని నివసిస్తున్న స్థలాలకు ఇంటి పట్టాలిచ్చి ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నగర న్యూ కమిటీ కార్యవర్గ సభ్యుడు ఇర్ఫాన్ అధ్యక్షతన ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఓ.నల్లప్ప, నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్వీ నాయుడు మాట్లాడుతూ.. ఉప్పరపల్లి పంచాయితీ 194/8 సర్వే నంబర్‌లోని గ్రామకంఠంలో దాదాపు 600 మంది పేద కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాయన్నారు. కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని 225/2ఏ సర్వే నంబర్‌లోనూ 50 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలు, గిరిజనులు వివిధ వృత్తులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సంపాదనంతా కుటుంబ నిర్వహణకే సరిపోతోందన్నారు. ఇంటి అద్దె కట్టలేకపోతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్నట్లు పేర్కొన్నారు. అధికారులు చొరవ తీసుకుని ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఇళ్లు మంజూరు చేయించాలని తెలిపారు. అనంతరం తహసీల్దార్ మోహన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీనారాయణ, రామాంజనమ్మ, శ్రీనివాసులు, పెరుగు గోపాల్, గౌస్, అల్లాబకాష్, నరేంద్ర, నారాయణమ్మ, ప్రమీల, శంకర్, నల్లప్ప, వేణు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల సవరణ ఆపేయండి



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక చట్టాల సవరణను వెంటనే ఆపేయాలని వామపక్ష కేంద్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట బ్లాక్‌డే పాటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్ర కుమార్, జే.రాజారెడ్డి, సురేష్ మాట్లాడారు. కార్మిక చట్టాల సవరణ ద్వారా దేశభద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. సంపాదన సృష్టించే శ్రామిక వర్గానికి తీవ్రంగా కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ ప్రభుత్వం ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందన్నారు. అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి రైతుల వ్యవసాయాన్ని కాపాడాలన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న కార్పొరేట్ కంపెనీలు దేశ సంపదను లూటీ చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఎం.నాగమణి, వెంకటనారాయణ, నాగభూషణం, ఏటీఎం నాగరాజు, ఎర్రిస్వామి, అజాంబాషా, రాజేష్, చిరంజీవి, రామలింగారెడ్డి, కృష్ణుడు, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో సెలూన్ షాపు దగ్ధం



కాలిపోయిన సామగ్రి

అనంతపురం: రుద్రంపేటలోని ప్రధాన రహదారి వద్ద ఉన్న మంగలి కుళ్లాయప్పకు చెందిన సెలూన్ షాపు సోమవారం తెల్లవారుజామున దగ్ధమైంది. ఈ షాపు పక్కనే ఉన్న టీస్టాల్‌లో ఫ్రిజ్‌కు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షాపులో ఉన్న మొత్తం వస్తువులన్నీ కాలిపోయాయి. టీ స్టాల్, సెలూన్ షాపుకు సంబంధించి రూ.4 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు.

కట్నం వెనక్కి ఇచ్చేయాలని ఆందోళన



జీజీహెచ్ మార్చురీ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న హసీనా

అనంతపురం: పెళ్లి సమయంలో వరకట్నం కింద ఇచ్చిన బంగారు, నగదు తిరిగి ఇచ్చేయాలంటూ భర్త మృతదేహం వద్ద భార్య నిరసనకు దిగింది. అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన హసీనాకు ఆరు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన షరీఫ్‌తో వివాహమైంది. వివాహ సమయంలో రూ.50 వేల నగదు, ఐదున్నర తులాల బంగారు ఇచ్చారు. 2019లో ఆమెకు కుమారుడు శాంతావలి జన్మించాడు. ఆ కుమారుడు హసీనాకు పుట్టలేదని కారణంతో భర్త ఆమెను దూరం పెట్టాడు. ఆదివారం షరీఫ్ కరెంట్ షాక్‌తో మరణించాడు. విషయం తెలుసుకున్న షరీఫ్ భార్య హసీనా.. తనకు, తన కుమారుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. కట్నం కింద తీసుకున్న మొత్తాన్ని ఇవ్వాలని.. న్యాయం చేసేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లనని భీష్మించింది. అనంతరం పోలీసులు ఆమెకు సర్దిచెప్పి మృతదేహం ఉన్న అంబులెన్స్‌ను పంపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి రూరల్: మండలంలోని పులిప్రొద్దుటూరు సమీపంలో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. ఎస్ఐ కాటయ్య, సిబ్బందితో కలసి తనిఖీ చేయగా జూదరులు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.1.50 లక్షలతో పాటు మూడు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో శ్రీనివాసపురానికి చెందిన షేక్ రహీంబాషా, పోరాటకాలనీ సోమనాథ్, రామాంజనేయులు, గాంధీకట్ట సాయికుమార్, సీపీఐ కాలనీ సురేంద్రరెడ్డి, పాతకోట షేక్ నబీరసూల్, ఇందిరానగర్ షేక్ జిలానీ, నందలపాడు షేక్ అబ్దుల్, పులిప్రొద్దుటూరుకు చెందిన సత్యనారాయణరెడ్డి, చింతారాజు ఉన్నారు.

ఎన్‌సీసీతో బంగారు భవిష్యత్

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు ఎన్‌సీసీతో బంగారు భవిష్యత్తు సాధ్యమని మిలటరీ అధికారి సుబేదార్ కౌశలేంద్ర సింగ్ సూచించారు. సోమవారం గుత్తి రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో చేరేందుకు కళాశాల డైరెక్టర్లు సత్య నారాయణ, రామ్‌కుమార్ ఆధ్వర్యంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి అశోక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థి దర్శన్ తేజ్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దర్శన్ తేజ్ (9వ తరగతి) జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 22, 23 తిరుపతిలో రాష్ట్ర స్థాయి జూడో పోటీలు నిర్వహించారన్నారు. ఇందులో దర్శన్ తేజ్ ప్రథమ స్థానం సాధించారన్నారు. అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకూ గుజరాత్ రాష్ట్రంలోని ఖేడ్‌లో జరిగే స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని హెచ్ఎం వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి, లలితమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: బూదిగుమ్మలోని హనుమంతురాయ స్వామి, పద్మావతి వెంకటరమణస్వామి ఆలయాల శాశ్వత హుండీలను సోమవారం ఈఓ అక్కిరెడ్డి, పర్యవేక్షణ అధికారి బాబుల ఆధ్వర్యంలో లెక్కించారు. హనుమంతురాయస్వామి ఆలయ హుండీ నుంచి రూ.51,713, శ్రీపద్మావతి వెంకటరమణస్వామి ఆలయ హుండీ నుంచి రూ.32,421 నగదు వచ్చింది. గ్రామపెద్దలు సేవా కమిటీ సభ్యులు అర్చకులు జ్ఞానేశ్వర్, వాసేదేవ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు సిద్దు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద వర్గాలకు చెందిన విద్యార్థులే ఎక్కువగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో చదువుకుంటున్నారన్నారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలకు నిధులు కేటాయించి నూతనంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న హాస్టల్ వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వంట మనిషి, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భీమేష్, ఉపాధ్యక్షుడు సోము, సహాయ కార్యదర్శి గణేష్, నాయకులు సాయి, మహేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: క్రీడలతో క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓబుళమ్మ అన్నారు. ఈనెల 20 నుంచి 21 వరకు మండల స్థాయిలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్, చెస్ యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించిన విషయం విదితమే. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మండలానికి చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మండల స్థాయిలో గెలిచిన వారు నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు నల్లప్ప, విజయ నిర్మల, అంజన్న, కుమార్ రాజ, కుసుమ, కొండమ్మ పాల్గొన్నారు.